

అరసవల్లిలో విజి'లెన్స్'

అరసవల్లిపై ఆరా తీస్తున్నారు. గత అధికారుల తీరు గురించి తెలుసుకుంటున్నారు.


- 8లో



రాళ్లపేటలో విష జ్వరాలు

రాళ్లపేట విష జ్వరాల బారిన పడింది. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

- 8లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహార్
గురు(సా)	శుక్ర(ఉ)
6.11	4.37

న్యూస్‌రీల్

లబ్ధిదారులకు ఈకేవైసీ తప్పనిసరి

పోలాకి: జిల్లాలో రేషన్‌కార్డు లబ్ధిదారులందరూ ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని డీఎస్‌ఓ జి.సూర్యప్రకాశరావు అన్నారు. బుధవారం మబగాం, ఈదులవలస రేషన్‌డిపోల్లో ఈకేవైసీ నమోదుకాని వారి వివరాలు, అందులో ఎంతవరకు ఈనెలలో అప్‌డేట్ అవుతున్నాయో అని పరిశీలించారు. పలువురు లబ్ధిదారులతో మాట్లాడి వారికి సమాచారం ఎంతవరకు వచ్చిందో అన్న విషయాలపై ఆరాతీశారు. స్థానిక రెవెన్యూ సిబ్బంది, డిపో డీలర్ సమన్వయంతో ఈనెల 31నాటికి శతశాతం ఈకేవైసీ అప్‌డేట్ జరిగేలా చూడాలని సూచించారు. ఆయన వెంట సీఎస్ డీటీ రామకృష్ణ, స్థానిక రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

యోగా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం



శ్రీకాకుళం న్యూకాలనీ: కేంద్ర ప్రభుత్వం, ఆయుష్ మంత్రిత్వ శాఖ ద్వారా ప్రధానమంత్రి యోగా అవార్డులు–2025 కోసం అర్హులైన వ్యక్తులు/సంస్థల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డాక్టర్ కె.శ్రీధర్‌రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యోగా అభివృద్ధి, యోగా ప్రచారం కోసం అత్యుత్తమ సహకారాన్ని అందించిన వారు, యోగా అభివృద్ధి కోసం విశేషమైన కృషి చేసి, అద్భుతమైన ట్రాక్ రికార్డు కలిగిన వ్యక్తులు/సంస్థలు ఈనెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని శ్రీధర్‌రావు పేర్కొన్నారు.

కిడ్నీ ఆస్పత్రిలో తాగునీరు కరువు



పలాస కిడ్నీ ఆస్పత్రిలో పనిచేయని ఫ్రిడ్జ్

కాశీబుగ్గ: ఉద్దాన కిడ్నీ రోగుల కోసం నిర్మించిన పలాస కిడ్నీ ఆస్పత్రి, డయాలసిస్ యూనిట్‌లో తాగడానికి మంచినీరు కరువైంది. ఆస్పత్రికి వచ్చిన వారంతా బయటే వాటర్ బాటిళ్లు కొనాల్సి వస్తోంది. ఆస్పత్రి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసి ఫ్రిడ్జ్ పనిచేయడం లేదు. దీంతో రోగులతో పాటు వందమందికిపైగా సిబ్బందికి సైతం సమస్యగా మారింది.

రోజుకు మూడుసార్లు వాటర్ బెల్



శ్రీకాకుళం న్యూకాలనీ: మండే ఎండల నేపథ్యంలో పాఠశాలల్లో విద్యార్థుల కోసం విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు తప్పనిసరిగా నీళ్లు తాగేలా రోజుకు మూడుసార్లు వాటర్ బెల్ మోగించనున్నారు. ప్రతిరోజు ఉదయం 10 గంటలకు, 11 గంటలకు, మళ్లీ మధ్యాహ్నం 12 గంటలకు విధిగా వాటర్‌బెల్ పాటించాలని పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. ఈ ఉత్తర్వులు నేటి నుంచే అమల్లోకి రానున్నాయి.

గురుకులాల్లో బ్యాక్‌లాగ్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మెళియాపుట్టి : 2025–26 విద్యా సంవత్సరంలో గురుకుల పాఠశాలల్లో 5 నుంచి 9వ తరగతుల్లో ప్రవేశాలకు(బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బుధవారం సీతంపేట ఐటీడీఏ నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 9లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.



కల.. వారిది కళే వారధి

నేడు ప్రపంచ రంగస్థల దినోత్సవం

ఆ వేదికపై ఉన్నంత వరకు అతడే దేవుడు.. అతడే భక్తుడు.. అతనే రాజు.. అతనే బంటు. నాటకం జరుగుతున్నంత వరకు వారి గుండెలు గొంతులా పలుకుతాయి.. కళ్లు కనిపించని జోలె పట్టి చప్పట్లు ఏరుకుంటాయి. ఆ ప్రదర్శన పూర్తయ్యే వరకు అదే వారి బతుకు.. అదే వారికి మెతుకు. నేడు ప్రపంచ రంగస్థల దినోత్సవం. ఇన్‌స్టా రీళ్లతో, ఫేస్‌బుక్ వీడియోలతో కుర్రకారు తెగ ఫేమస్ అయిపోతున్న కాలంలో.. దశాబ్దాల తరబడి కళకు బతుకులను అర్పించిన వారు మాత్రం అలా వేదిక మూలన ఎవరికీ తెలీకుండా మిగిలిపోతున్నారు. రంగస్థల దినోత్సవం సందర్భంగా కొందరి గురించైనా తెలుసుకుందాం. ఎన్నో ఏళ్ల కల వారిది.. అది నెరవేర్చిన కళ వారికి మనకు వారధి.

– శ్రీకాకుళం కల్చరల్, కవిటి, పలాస







సత్యవతి కళాసేవ

శ్రీకాకుళం సమీపంలోని సింగుపురానికి చెందిన పైడి సత్యవతి గత 35 ఏళ్లుగా నాటక రంగానికి సేవ చేస్తున్నారు. 1990 నుంచి శ్రీసరస్వతీ నాటక కళా సమితి, కరజాడ భైరి సూర్యనారాయణ మాస్టర్ ద్వారా లవకుశ నాటకంలో రంగప్రవేశం చేశారు. 500 సాంఘిక ప్రదర్శనలు, 3000 పౌరాణిక ప్రదర్శనలు ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 'కందుకూరి' పురస్కారాన్ని కుడా అందుకున్నారు.

నటనలో నాయక్

వీధి పగటి వేషాలైన కోయద్యాన్సు, వివిధ నృత్యాల మొదలుకుని ఏకపాత్రల వరకు అన్నింటా శభాష్ అనిపించుకున్నార్ కుమార్ నాయక్. మందస మండలం బొగాబందకు చెందిన నాయక్ సాంఘిక సంక్షేమ శాఖలో సంక్షేమ అధికారిగా విధులను నిర్వహిస్తూ కళకూ సేవ చేశా రు. గ్రామాల్లో యువకులను చేరదీసి ఈ కళారూపాల్లో ఒక గురువుగా పేరు తెచ్చుకున్నారు. జానపద కళలు, కళాఖండాలు నాడు నేడు ఎలా ఉన్నాయనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు డాక్టరేటు పట్టా కూడా లభించింది.

నటగోపాలుడు

పౌరాణిక నటుడుగా యడ్ల గోపాలరావు 55 ఏళ్లుగా నాటక రంగానికి ఎనలేని సేవలు అందిస్తున్నారు. ఈయన శ్రీకృష్ణ, నారద, నక్షత్రక, అర్జున పాత్రలు వేస్తుంటారు. హరిశ్చంద్రనాటకంలో నక్షత్రక పాత్రకు జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. ఆయన స్వగ్రామమైన మందరాడలో అభిమానులంతా కలిసి నాటక రంగంలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కనకాభిషేకం చేశారు.

పౌరాణిక 'మోహనుడు'



శ్రీకాకుళంలోని కత్తెరవీధికి చెందిన బీఏ మోహనరావు పౌరాణిక నాటక దర్శకులు, హార్మోనియం కళాకారుడు, శిక్షకుడు. ఈయన ఇరిగేషన్ శాఖలో ఇంజినీరుగా పనిచేసి పదవీ విరమణ పొందారు. 1991 నుంచి శ్రీకాకుళంలో శ్రీశ్రీనివాస కళా సమాఖ్య స్థాపించి అనేక మందికి పౌరాణిక నటన, సంగీతంలో శిక్షణ ఇచ్చారు. రంగస్థల కళాకారుల సమాఖ్య కోశాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

4వేల ప్రదర్శనల రాజేశ్వరి



ఒడిశాకు చెందిన రాజేశ్వరి శ్రీకాకుళం నగరానికి చెందిన శ్యామ్‌కుమార్‌ను వివాహం చేసుకున్నారు. 11 ఏళ్ల వయసులో నాటక రంగంలో ప్రవేశించిన ఆమె 4వేలకుపైగా ప్రదర్శనలు ఇచ్చారు. మార్కెట్‌లో ప్రజాస్వామ్యం, ఎర్రసముద్రం వంటి సినిమాల్లోనూ నటించారు. అలాగే ఇటీవల జయమ్మ పంచాయతీ, కన్యాకుమారి, పెళ్లయ్యింది గానీ సినిమాల్లోనూ మెరిశారు. టీవీ సీరియళ్లలోనూ నటించారు. ముత్యాలమ్మ నాటక కళాపరిషత్ పేరుతో నాటిక పోటీలు నిర్వహిస్తున్న కళాసేవ చేస్తున్నారు.

పన్నాల వారి నటన..



శ్రీకాకుళంలోని ఫాజుల్‌భాగ్‌పేటకు చెందిన పన్నాల నర్సింహమూర్తికి సాంఘిక నటనలో 46ఏళ్ల అనుభవం ఉంది. శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య కార్యదర్శిగా ప్రతి నెల ఒక సాంస్కృతిక కార్యక్రమాన్ని ప్రదర్శింప జేస్తూ ఇప్పటికి 200 మాసాలుగా 200 ప్రదర్శనలు ఎంతో మంది సహకారంతో ఏర్పాటు చేశారు. జిల్లా సాంస్కృతిక మండలి సభ్యులుగా, కళాజగతి పాత్రికేయులుగా వ్యవహరిస్తున్నారు.

నా అదృష్టం



కవిటి మండలం కుసుంపురం గ్రామంలో వేణుగోపాల స్వామి ఆలయంలో అర్చకునిగా, చక్రధర పెరుమాళ్ల స్వామి ఆస్థాన విద్వాంసునిగా నా తండ్రి బొంతలకోటి కృష్ణారావు కళకు సేవ చేశారు. ఆయన మార్గదర్శనంలో డాక్టర్ ఎల్లా వేంకటేశ్వరరావు గైడెన్స్‌లో పీహెచ్‌డీ పూర్తిచేయడం నాకు కలిగిన అదృష్టం. ఇప్పుడు బెనారస్ హిందూ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తుండడం నాకు దక్కిన అరుదైన అవకాశం.

– డాక్టర్ బీఎస్‌వీ ప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్, బెనారస్ హిందూ యూనివర్సిటీ, వారణాశి



కవిటి: బొరివంకలో లక్ష్మణమూర్తి మాస్టార్ నిర్మించిన కళావేదిక

విరాళమే కళకు ఊపిరి..

కవిటి మండలంలో కళావేదికలు ప్రత్యేకంగా కనిపిస్తాయి. ఇటీవల బొరివంకలో అదే పాఠశాలలో పనిచేసిన ప్రధానోపాధ్యాయుడు బాసా ప్రభాకరరావు రూ.లక్ష విరాళాన్ని కళావేదిక నిర్మాణానికి వితరణ చేశారు. అదే పాఠశాలలో చదువుకున్న బల్లెడ లక్ష్మణమూర్తి మాస్టార్ సోదరులు సుమారు మరో రూ.5లక్షలకు పైగా వెచ్చించి ఓ కళావేదికను ఏర్పాటుచేశారు. ముత్యాలపేటకు చెందిన దివంగత మృదంగ విద్వాంసుడు ఆరంగి దేవేంద్రమూర్తి తన జీవితంలో 65 ఏళ్లకు పైగా పేద కళాకారులకు తన ఇంటిలోనే భోజనం పెట్టి ఆదరించారు.

భక్త ప్రహ్లాద మా బతుకులో భాగం



మా తాత తండ్రుల కాలం నుంచి భక్తప్రహ్లాద అనే పౌరాణిక నాటక ప్రదర్శనతో మా కుటుంబానిది విడదీయలేని అనుబంధం. టీచర్‌గా పని చేస్తూనే నాటక రంగానికీ సేవ చేయగలిగాను. నంది గెలుచుకోవడం ఓ మధురమైన అనుభవం.

– బల్లెడ మోహనరావు, బొరివంక, కవిటి,

నటనతో మానసిక ప్రశాంతత..



నేను ఫిజిక్స్ టీచర్‌గా పని చేస్తూనే నాటకాలు వేస్తుంటాను. నటన అనే అభిరుచి నాకు మానసిక ప్రశాంతతను అందిస్తుంది. నాటిక పోటీల్లో ప్రదర్శనకు నంది అవార్డు సాధించడం కూడా నాకు మరచిపోలేని అనుభూతి.

– బల్లెడ అమరేంద్రం, బొరివంక, కవిటిమండలం

పెద్దపేట కేంద్రంగా క్రికెట్ బెట్టింగ్



నరసన్నపేట: నరసన్నపేటలో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ జోరుగా జరుగుతోంది. పెద్దపేటకు చెందిన ఇద్దరు యువకులు ఈ బెట్టింగ్ వ్యవహారం నడుపుతున్నట్లు సమాచారం. బజారు వీధితో పాటు ఆదివరపుపేట కూడలి, తమ్మయ్యపేట జంక్షన్ తదితర చోట్ల గుట్టు చప్పుడు కాకుండా బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. సాయంత్రం ఆరు గంటల నుంచి మొదలవుతున్న బెట్టింగులు రాత్రి 10 వరకూ నిర్వహిస్తున్నారు. ఓవర్‌కు ఎంత స్కోర్ చేస్తారు.. ఏ ప్లేయర్ ఎంత స్కోర్ చేస్తారు.. ఏ ప్లేయర్ ఎన్ని సిక్స్‌లు కొడతారు, ఎన్ని ఫోర్లు కొడతారు.. అనే వాటితో పాటు అనేక రకాల బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు భోగట్టా. స్థానిక పెద్దపేటకు చెందిన చెన్నైలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థి ఒకరు ఈ బెట్టింగ్‌ల్లో రూ. 30 లక్షలు వరకూ పోగొట్టుకున్నట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న తండ్రి లబోదిబోమంటూ స్థానిక మాజీ ఎంపీటీసీ జామి వెంకటరావు వద్ద మొరపెట్టుకున్నారు. దీనిపై ఎస్పీ కార్యాలయం కూడా ఆరా తీస్తోంది.

బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు: సీఐ

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని యువత బెట్టింగ్‌ల వైపు వెళ్లవద్దని నరసన్నపేట సీఐ జే. శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో బెట్టింగ్‌లో పాల్గొనడం నేరమని అన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీలో రెడ్డి శాంతి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ నియామకం చేస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం తాడేపల్లి నుంచి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కమిటీలో చైర్మన్‌గా శెట్టిపల్లి రఘురామిరెడ్డి, మెంబర్లుగా రెడ్డి శాంతి, తానేటి వనిత, కైలే అనీల్‌కుమార్, వై.విశ్వేశ్వరరెడ్డిలను నియమించినట్లు తెలిపారు.

పెళ్లయిన 48 రోజులకే..

- రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



కోసంగిపురం జాతీయ రహదారిపై విగతజీవిగా మధుసూదన యాదవ్

కాశీబుగ్గ: తాళి కట్టి రెండు నెలలైనా అవ్వలేదు.. నూతన వధువు కాళ్ల పారాణి కూడా పూర్తిగా ఆరలేదు.. కొత్త దంపతుల ముచ్చట్లే తీరలేదు.. అంతలోనే విధికి కన్నుకుట్టింది. రోడ్డు ప్రమాదం రూపంలో ముంచుకొచ్చిన మృత్యువు వరుడిని తనతో తీసుకెళ్లిపోయి వధువుకు తీరని శోకం మిగిల్చింది. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కోసంగిపురం జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పలాస మండలం గొల్లమాకన్నపల్లి గ్రామానికి చెందిన కోరాడ మధుసూదన్ యాదవ్ (28) మృతి చెందారు. ఆయన వివాహం జరిగి కేవలం 48 రోజులైంది.

గొల్లమాకన్నపల్లికి చెందిన మధుసూదన్ మంగళవారం పలాసలో మార్కెట్‌కు వెళ్లి వస్తానని ఇంటి నుంచి తన బుల్లెట్‌పై బయల్దేరారు. అక్కడ పని చూసుకుని తిరిగి వస్తుండగా కోసంగిపురం జాతీయ రహదారిపై అతడి బండి ప్రమాదానికి గురై 50 మీటర్ల దూరం అవతల పడిపోయాడు. రాత్రి పూట ప్రమాదం జరగడంతో వెనుక నుంచి వాహనం ఢీకొట్టిందా, లేదా బండి స్కిడ్ అయ్యిందా అన్నది నిర్ధారణ కాలేదు. రాత్రి వేళ కొన ఊపిరితో రోడ్డు పక్కన ఉండగా స్థానికులు గమనించి అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సామాజిక ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో ప్రాణాలు వదిలినట్లు అంబులెన్సు సిబ్బంది తెలిపారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేయగా బుధవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. గ్రామంలో జరిగిన అంత్యక్రియలకు ఉద్దాన పరిసర ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

తీరని విషాదం

మధుసూదన్ తండ్రి లింగమూర్తి ఇండియన్ ఆర్మీలో పనిచేసి రిటైరయ్యారు. గత నెల 6వ తేదీన మధుసూదన్‌కు వివాహమైంది. ఆ సందడి తీరక మునుపే ఇంత ఘోరం జరగడంతో బంధువులు, గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు. మధు వ్యవసాయం చేస్తుంటాడు. తండ్రితో పాటు కుమారుడు మధు కూడా ఉద్దాన విద్యా అభివృద్ధి వేదిక, మాజీ సైనికుల సంక్షేమ సంఘంతో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి అందరితో కలివిడిగా ఉండేవాడు.

క్లుప్తంగా

కోచింగ్ సెంటర్ ఎంపికకు గడువు పెంపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో డీఎస్సీ ఉచిత శిక్షణకు ఎంపికైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు వెబ్ ఆప్షన్‌లో కోచింగ్ సెంటర్ ఎంపిక చేసుకునేందుకు ఈ నెల 28 వరకు గడువు పొడిగించినట్లు డీడీ విశ్వమోహన రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

టెన్త్ విద్యార్థికి గాయం



వెంకటరమణకు బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది

నరసన్నపేట: స్థానిక సెంట్‌క్లారెట్ స్కూల్లో పరీక్ష రాస్తున్న టెన్త్ విద్యార్థి బి.వెంకటరమణ గాయపడ్డాడు. స్కూల్లో గోడకు ఉన్న మేకు తలకు తగలడంతో రక్త స్రావమైంది. వెంటనే పీహెచ్‌సీ సిబ్బంది, మహిళా కానిస్టేబుల్ స్పందించి ప్రాథమిక చికిత్స అందించారు. బీపీ చెక్ చేసిన అనంతరం పరీక్షకు హాజరయ్యాడు. జలుమూరు మండలం బసివాడకు చెందిన వెంకటరమణ నరసన్నపేట మండలం కంబకాయ స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు.

గుండెపోటుతో వీఆర్‌ఓ మృతి

- ఒత్తిడే కారణమంటున్న ఉద్యోగ సంఘాలు



రాజారావు(ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని బడివానిపేట వీఆర్వో పుట్ట రాజారావు (50) బుధవారం గ్రామ సచివాలయంలో విధి నిర్వహణలో ఉండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. తోటి సిబ్బంది సీపీఆర్ చేసి 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి రిమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందారు. రాజారావు స్వస్థలం చిలకపాలెం. ఇతనికి భార్య, కుమారుడు ఉన్నారు. కాగా, రాజారావు పనిఒత్తిడి కారణంగానే మృతిచెందారని ఉద్యోగ సంఘాల నాయకులు, వీఆర్వోలు చెబుతున్నారు. రెవెన్యూ, మండల పరిషత్, పంచాయతీరాజ్ ఇలా అన్ని సర్వేలు, పనులు తమతోనే చేయిస్తున్నారని మండిపడుతున్నారు. తాము ఎవరి పనిచేస్తున్నామో తమకే తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లు కూడా ఎక్కువయ్యాయని వాపోతున్నారు. కాగా, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీఓ సాయి ప్రత్యూష, తహసీల్దార్ గోపాలరావు బుధవారం రాత్రి రాజారావు ఇంటికి వెళ్లి నివాళులర్పించారు.మృతిపై ఆరా తీశారు.



- గత ఈవోల హయాంలో నిధుల దుర్వినియోగంపై ఆరా
- అధికారులకు చిక్కకుండా తప్పించుకున్న రిటైర్డ్ ఈవో

అరసవల్లిలో విజిలెన్స్



అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో మంగళ,బుధవారాల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. కార్యాలయంలో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. మంగళవారం ఓ వైపు హుండీ కానుకల లెక్కింపు జరుగుతున్న క్రమంలో మరోవైపు కార్యాలయంలో విజిలెన్స్ అధికారుల బృందం తనిఖీలు చేపట్టడం గమనార్హం. అయితే ఇప్పుడు విధుల్లో ఉన్న ఈవో కొత్తగా రావడంతో ఆయనకు గత నిధుల దుర్వినియోగంతో సంబంధం లేకున్నప్పటికీ సిబ్బందిలో మాత్రం ఆందోళన నెలకొంది. ప్పట్లో ఈవోలుగా పనిచేసిన రమేష్ బాబు, చంద్రశేఖర్‌ల హయాంలో నిధుల వినియోగంపై విజిలెన్స్ అధికారులు ఆరా తీసినట్లుగా తెలిసింది. నిధుల దుర్వినియోగంలో గత ఈవో చంద్రశేఖర్‌కు ఆలయంలో పనిచేస్తున్న రిటైర్డ్ ఈవో జగన్మోహనరావుతో పాటు మరో రెగ్యులర్ ఉద్యోగి, ముగ్గురు దినసరి వేతనదారులు చాలా వరకు సహకరించారని విజిలెన్స్ అధికారులు గుర్తించినట్లు సమాచారం. డిప్యుటేషన్ విధుల్లో ఉన్న అటెండర్ శ్రీనివాస్‌కు ఎరియర్స్‌తో కూడిన పీఆర్సీని నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టడాన్ని కూడా విజిలెన్స్ అధికారులు గుర్తించినట్లు తెలిసింది. గతంలో ఆలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ సస్పెన్షన్‌కు గురైన కృష్ణమాచార్యులు లిఖితపూర్వకంగా ఇచ్చిన ఫిర్యాదులకు అనుగుణంగానే తాజాగా ఆలయంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలను చేస్తున్నట్లు సమాచారం.

ప్రశ్నలకు సమాధానమేదీ.!

గత ఈవో చంద్రశేఖర్ హయాంలో జరిగినట్లుగా భావిస్తున్న నిధుల దుర్వినియోగాలపై విజిలెన్స్ అధికారులు స్థానిక ఆలయ సిబ్బందిపై ప్రశ్నల వర్షం కురిపించారు. దేనికీ సరైన రికార్డు లేకపోగా.. సమాధానం కూడా కరువైపోయి నీళ్లు నమలడమే తరువాయిగా మారింది.

వారినే అడగండి..

ముందుగా ఆలయ ఈవో అధికారిక వాహనం కొనుగోలు, వాహన ఇంధనం వినియోగ బాకీలు, కంప్యూటర్ల కొనుగోళ్లు, ఇతర సామగ్రి కొనుగోళ్లు, రూ.లక్షల బిల్లులతో పట్టుచీరలు, వస్త్రాల కొనుగోళ్లు, భక్తులకు ఇచ్చినట్లుగా చూపుతున్న మజ్జిగ, పాలు బిల్లులతో పాటు ఆలయానికి రంగులకు రూ.26 లక్షల వినియోగం.. ఇలా చాలావరకు ఆలయానికి చెందిన నిధులు దుర్వినియోగం అయినట్లు దాదాపుగా నిర్ధారణకు వచ్చిన విజిలెన్స్ అధికారులు.. ఈమేరకు ఆలయ సిబ్బందిని ప్రశ్నిస్తే గత ఈవోలకు అడగండని సమాధానాలను దాటవేసినట్లు సమాచారం. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ నేరుగా ఫిర్యాదుదారుడు కృష్ణమాచార్యులతో ఫోన్లో సంప్రదించి.. అవసరమైతే ప్రత్యక్షంగా ఆధారాలు ఇస్తూ స్టేట్‌మెంట్ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పినట్లుగా విశ్వసనీయంగా తెలిసింది. ఇదిలా ఉండగా...విజిలెన్స్ అధికారులు మంగళవారం సాయంత్రం వరకు రికార్డులను, బిల్లులను తనిఖీలు చేస్తుంటే.. అప్పట్లో క్యాష్‌బుక్ బాధ్యుడిగా ఉన్న రిటైర్డ్ ఈవో జగన్మోహనరావు మాత్రం విజిలెన్స్ అధికారులకు కనిపించకుండా రెగ్యులర్ ఉద్యోగులు మాత్రమే వెళ్లాలంటూ తాను మాత్రం తప్పించుకుని వెళ్లిపోయారు. దీన్ని విజిలెన్స్ సిబ్బంది ఒకరు గమనించి పెద్దాయన ఎందుకు వెళ్లిపోయారంటూ ప్రశ్నించడంతో పరిస్థితి మారిపోయింది. కంప్యూటర్ల కొనుగోళ్లు, సామగ్రి, సీసీ కెమెరాల ఏర్పాటు, భక్తులకు సౌకర్యాల కల్పన పేరుతో భారీగా నిధులు స్వాహా జరిగిందని విజిలెన్స్ అధికారులు గుర్తించి విజిలెన్స్ ఎస్పీ ప్రసాదరావుకు నివేదించనున్నట్లు తెలిసింది. దీనిపై ఆలయ అధికారులు గానీ సిబ్బంది గానీ ఎవ్వరూ నోరు మెదపడం లేదు. ఏదిఏమైనా ఆదిత్యుని ఆలయ నిధుల స్వాహా జరిగిందనే అభియోగాలు, ఆరోపణలపై త్వరలో తుది నివేదిక సిద్ధమై కారకులపై చర్యలు తీసుకోవచ్చనే చర్చ జోరందుకుంది.

వాస్తవమే..

ఈ విషయమై ఈఓ వై.భద్రాజీ వద్ద ప్రస్తావించగా మంగళ, బుధవారాల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టిన విషయం వాస్తవమేనన్నారు. ఆలయ రికార్డులు పరిశీలించగా, వారికి సహకరించామని చెప్పారు.

వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా యంత్రాంగం అర్హులైన వీఆర్‌ఏలకు వీఆర్వో, అటెండర్లుగా పదోన్నతులు కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.త్రినాథరావు, కె.రమణమూర్తి డిమాండ్ చేశారు. వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, నైట్ డ్యూటీలు రద్దు చేయాలని, పదోన్నతులు కల్పించాలని కోరుతూ ఏప్రిల్ 5న విజయవాడ ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న వీఆర్‌ఏ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు శ్రీకాకుళం సీఐటీయూ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. సంఘం జిల్లా నాయకులు ఎస్.సీతప్పడు, డి.అప్పారావు, కె.పురుషోత్తం, బి.రాములమ్మ, మీనాక్షి, రాజారావు, లోకనాథం, శంకర్, బొమ్మాలి, వెంకటరమణ, రామ్మూర్తి, లక్ష్మణరావు, ముకుంద తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సంఘ ప్రతినిధులు జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

కుక్కల దాడిలో జింక మృతి



మృతిచెందిన జింకను పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది

ఇచ్ఛాపురం: పురపాలక సంఘం పరిధిలోని రత్తకన్న గ్రామంలో వీధి కుక్కల దాడిలో జింక మృతి చెందింది. సమీప కొండల నుంచి దారితప్పి గ్రామంలోనికి ప్రవేశించిన సమయంలో వీధికుక్కలు వెంటపడటంతో ఈ ఘటన చోటుచేసుకుంది. వెంటనే గ్రామస్తులకు అటవీ అధికారులకు సమాచారం అందించారు. కాశీబుగ్గ ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎ.మురళీకృష్ణనాయుడు ఆదేశాల మేరకు డిప్యూటీ రేంజ్ అధికారి బి.రాము, ఫారెస్టు బీట్ అధికారులు సిబ్బంది మృతిచెందిన జింకను పరిశీలించారు. గ్రామస్తుల సమక్షంలో బెల్లుపడ వెటర్నరీ సిబ్బంది పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని దహనం చేశారు. ఇదిలా ఉండగా రత్తకన్న సమీపంలోని ఎర్రమట్టి కొండల నుంచి గ్రావెల్‌ను కొందరు అక్రమంగా తవ్వేయడంతో కొండలు కరిగిపోతున్నాయని, అక్కడి వన్యప్రాణులు జనావాసాల్లోకి వచ్చి మృత్యువాత పడుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.



పోలవరం.. పోటెత్తిన జనం

మండలంలోని పోలవరం గ్రామం బుధవారం జనాలతో కిక్కిరిసిపోయింది. పాశిపోలమ్మ సిరిమానోత్సవం ముగింపు సందర్భంగా నిర్వహించిన విందు కార్యక్రమాలకు జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో బంధువులు రావడంతో టెక్కలి-పాతపట్నం రోడ్డులో ట్రాఫిక్ స్తంభించింది. గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోవడంతో పక్కనే ఉన్న నౌపడ-గుణుపూర్ రైల్వే ట్రాక్‌పై రాకపోకలు సాగించారు. సీఐ విజయకుమార్ నేతృత్వంలో పోలీస్ సిబ్బంది ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. - టెక్కలి

డీఈఓను విధుల నుంచి తప్పించాలి

- ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక నాయకులు డిమాండ్
- రెండో రోజూ కొనసాగిన నిరసన



డీఈఓ కార్యాలయం వద్ద నినదిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో కుప్పిలి కేంద్రంలో మాస్ కాపీయింగ్ ఘటనలో సస్పెండైన 14 మంది ఉపాధ్యాయులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ముందస్తు ప్రణాళికతో దాడిచేసి వ్యక్తిగత మైలేజ్ కోసం జిల్లా పరువు, ప్రతిష్టతలను మంటగలిపి ఉపాధ్యాయులను అన్యాయంగా సస్పెండ్ చేసిన డీఈఓ తిరుమల చైతన్యను వెంటనే విధుల నుంచి తప్పించాలనికి జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక నాయకులు డిమాండ్ చేశారు. సస్పెండైన టీచర్లతోపాటు డిబారైన ఐదుగురు విద్యార్థులకు న్యాయం చేయాలని నినదించారు. ఈ మేరకు ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడివేదిక ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట రెండో రోజు బుధవారం కూడా నిరసన కార్యక్రమం కొనసాగించారు. ఉమ్మడి వేదిక ముఖ్య ప్రతినిధులు చౌదరి రవీంద్ర, తంగి మురళీమోహన్, మజ్జి మదన్‌మోహన్, డి.శివరాం ప్రసాద్, పిసిని వసంతరావు తదితరులు మాట్లాడుతూ డీఈఓ ఉపాధ్యాయుల పట్ల కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 2023 సాధారణ బదిలీల నుంచి ఉపాధ్యాయులను దోషులుగా చిత్రీకరించే పనిలో నిమగ్నమయ్యారని దుయ్యబట్టారు. కుప్పిలి కేంద్రంలో జరిగిన సంఘటన అతిగా చిత్రీకరించి విద్యార్థులను మానసికంగా ఒత్తిడికి గురిచేసి ప్రశాంతంగా పరీక్షలు రాయటంలో తీవ్ర ఆటంకం కలుగజేసిన డీఈఓపై, దాడిలో పాల్గొన్నవారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ కార్యాలయం వద్ద వందలాది మంది ఉపాధ్యాయులతో చేపట్టనున్న ఉపాధ్యాయుల పోరాట ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు కొప్పల భానుమూర్తి, బమ్మిడి శ్రీరామ్మూర్తి, గొంటి గిరిధర్, సంపతిరావు కిషోర్‌కుమార్, గురుగుబెల్లి రమణ, పేడాడ కృష్ణారావు, బల్లెడ రవి, శీర రమేష్‌బాబు, ఎంపీ రమణ, ఎస్.సత్యనారాయణ, బలివాడ ధనుంజయ్, బోనెల రమేష్, కె.పద్మావతి, బి.మోహనరావు, పప్పల రాజశేఖర్, దామోదరావు, వెంకటరమణ, శ్రీనివాస్ తదితరులుపాల్గొన్నారు.

ఏఐపై జిల్లా ఉద్యోగులకు శిక్షణ



కలెక్టర్ల సదస్సులో మాట్లాడుతున్న స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో కెమికల్ ఇంజినీర్లకు డిమాండు పెరిగిందని, ఫార్మా రంగంలోనూ శ్రీకాకుళం అభివృద్ధి చెందుతోందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చెప్పారు. అమరావతిలో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సులో జిల్లా ప్రగతిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ వినియోగంపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

భాషా శాస్త్రవేత్తల సదస్సుకు గౌరీశంకర్



ప్రసంగిస్తున్న భమిడిపాటి గౌరీశంకర్

శ్రీకాకుళం కల్చరల్: తెలంగాణలోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఈ నెల 25, 26 తేదీల్లో కేంద్రీయ భాషా ప్రాధికార సంస్థ, తెలుగు భాషా వేదిక, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగం సంయుక్తంగా నిర్వహించిన 13వ అంతర్జాతీయ భాషా శాస్త్రవేత్తల సదస్సులో మునసబుపేటలోని గాయత్రీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్‌లో తెలుగు విభాగాధిపతి భమిడిపాటి గౌరీశంకర్ పాల్గొన్నారు. నూతన విద్యావిధానం-భారతీయ భాషలు అనే అంశంపై పత్ర సమర్పణ చేసి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా గౌరీశంకర్‌ను గాయత్రీ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు, ప్రిన్సిపాల్ పులఖండం శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ కె.వి.వి.సత్యనారాయణ, డాక్టర్ మార్తాండ కృష్ణ, సీతారాంనాయుడు, మేజర్ వి.మహేష్ అభినందించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

టెక్కలి రూరల్: మండంలోని చల్లపేట గ్రామానికి చెందిన హనుమంతు కృష్ణారావు(59) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణారావు కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతూ తట్టుకోలేక మంగళవారం రాత్రి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. కృష్ణారావుకు భార్య బానమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు కేసు నమోదు చేశారు.



రాళ్లపేటలో విషజ్వరాలు



రాళ్లపేటలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న శ్రీకూర్మం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

గార: మేజర్ పంచాయతీ రాళ్లపేటలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. కొన్ని రోజులుగా జ్వర పీడితులు ఎక్కువవుతుండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న శ్రీకూర్మం పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. జ్వర పీడితులను గుర్తించి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ విషయమై డాక్టర్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ ఇవి సాధారణ జ్వరాలునేని, నీటిని వేడి చేసి తాగాలని సూచించారు. పారిశుద్ధ్యం, తాగునీరు విషయమై పంచాయతీ కార్యదర్శితో మాట్లాడామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ మృతి




టెక్కలి రూరల్: మండల కేంద్రం టెక్కలిలోని చేరివీధికి చెందిన పైల ప్రతాప రెడ్డి(38) అనే ఆర్మీ జవాన్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీలో జవాన్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రతాపరెడ్డి మూడు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందారు. మృతదేహాన్ని టెక్కలి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రతాపరెడ్డికి భార్య ధనం, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉద్దానం ఫేజ్-2 ప్రాజెక్టు ట్యాంకుకు స్థల పరిశీలన

పాతపట్నం: మండలంలోని కొరసవాడ-బోరుబద్ర గ్రామాల మధ్య కొండ సమీపంలో ఉద్దానం ఫేజ్-2 ప్రాజెక్టుకు వాటర్ ట్యాంకు నిర్మించేందుకు నాలుగు ఎకరాల స్థలాన్ని టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, తహశీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. రూ.260 కోట్లతో పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలంలోని వివిధ గ్రామాలలకు తాగునీరు అందించేందుకు వాటర్ ట్యాంకు నిర్మాణం, పైపులైన్ పనులు చేపట్టనున్నారు. ఉద్దానం ప్రాజెక్టు పనులు త్వరితగతిని చేయాలని ఆర్డీఓ ఇంజినీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.చంద్రకుమారి, ప్రాజెక్టు డీఈఈ ఆశలత, మండల సర్వేయర్ రామగణపతి, ప్రాజెక్టు ఇంజినీర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి తవ్వకాల అడ్డగింత



పలాస తహశీల్దారు కార్యాలయం వద్ద ట్రిప్పర్లు

పలాస: మండలంలోని కేదారిపురంలో మంగళవారం రాత్రి పొలంలో అక్రమంగా మట్టిని తవ్వడానికి ప్రయత్నం చేస్తుండగా అక్కడ ఉన్న మూడు ట్రిప్పర్లను అధికారులు సీజ్ చేశారు. మట్టి తవ్వడానికి వాహనాలతో కొంతమంది వచ్చారని పలాస తహశీల్దారు టి.కళ్యాణచక్రవర్తికి సమాచారం రావడంతో రాత్రి 8 గంటల సమయంలో కాశీబుగ్గ పోలీసులతో వెళ్లారు. వాహనాలను సీజ్ చేసి కార్యాలయానికి తరలించారు. బుధవారం సంబంధిత వ్యక్తులను పిలిపించి ట్రిప్పర్‌కు రూ.10వేలు చొప్పున రూ.30వేలను అపరాధ రుసుం విధించారు. దాడుల్లో ఆర్ఐ కైలాసం, కాశీబుగ్గ ఎస్ఐ చంద్రరావు పాల్గొన్నారు.